


# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**JUNE - 2018**

సంవత్సర చందా రూ. 50/-

# టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

## సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

**Youtube లో satyavanichurchofchrist.com**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి


**SATYA VANI**

**P.O.BOX. 80, KAKINADA**

**PIN : 533004. Ph : 0884 - 2363722**

**98489 98547, www.satyavanicoc.com**

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

| సంపుటి - 39 | జూన్ - 2018 | సంచిక -11 |
|---|---|---|


## పాపము యొక్క సమీక్ష

## ( Survey of Sin )

మానవుల జీవితములో పాపము యదార్థము. పాపము యొక్క ఉనికిని మనము నిరాపించ నవుసరము లేదు. అయితే ఈ లోక మంతయు మాయ, పాపము కూడ మాయ యని వాదించేవారు నేడు మన మధ్య లేకపోలేదు. మానసికముగా బలహీనులైన వారే పాపమును గూర్చి తలంచుదురు అని నిర్దేవులు చెబుతూ యుంటారు. అయితే మానవుని దుష్ప్ర వర్తనయే పాపమున్నదని గంభీరముగ బోధించుచున్నది. ప్రతి దేశము యొక్క ప్రభుత్వము నేరస్తులను, నేరములను, దుర్మార్గులను అదుపులో యుంచుటకు ఏటేటా కోట్లకొలది రూపాయలు ఖర్చు పెట్టుచున్నది. మన దేశములో ప్రతి రెండున్నర నిమిషములలోను ఒక దొంగతనము జరుగుచున్నది. కనిసము గంటకొక నరహత్య జరుగు చున్నది. ఇవన్నియు ఎందువలన జరుగుచున్నవి? పాపము వలన జరుగుచున్నవని మనము చెప్పుకొనక తప్పదు.

రోమీయులకు వ్రాసిన పత్రిక మొదటి అధ్యాయములో అన్యజనులు తమ ప్రవర్తనవలన పాపములో

జీవించు చున్నారని అపో.పౌలు నిరూపించెను. రెండవ అధ్యాయములో యూదులు కూడ అట్లే పాపములో జీవించుచున్నారని అతడు నిరూపించెను. గనుక నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు; ఏ భేదమును లేదు; అందరు పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు అని అతడు బోధించెను (రోమా 3:10,23). ఇందు విషయమై బైబిలు విపులముగా బోధించుచున్నది. "మనము పాపము చేయలేదని చెప్పుకొనిన యెడల, ఆయనను అబద్ధికునిగా చేయు వారమగుదుము; మరియు ఆయన వాక్యము మనలో ఉండదు" (1యోహాను 1:10). మనము పాపములేని వారమని చెప్పుకొనిన యెడల, మనలను మనమే మోస పుచ్చుకొందుము; మరియు మనలో సత్యముండదు (1:8).

పాపమనగా యేమిటి? మంచి చెడుగులను నిర్వచించుటలో మానవుల యభిప్రాయములు వేర్వేరుగా యున్నవి. నా మనస్సుకు ఏది మంచిదని తోచితే అది మంచిది, ఏది చెడ్డదని తోచితే అది చెడ్డది అని కొందరు వింతగ వాదించుచుందురు. అట్లయిన లోకములో జరుగు నరహత్యలు, దొంగతనములు, దుష్క్రియలు అన్నియు మంచివే. ఏలయనగా వాటిని చేయువారి దృష్టిలో అవి మంచివే. దీనిని బట్టి అధోగతిలో పడిపోయిన మానవుడు పాపమును నిర్వచించలేడని మనకు అర్ధమగు చున్నది. కాని దేవుడయితే దానిని నిర్వచించెను. ఆయన మానవునికి బయలు పరచి బైబిలు గ్రంధములో దానిని నిర్వచించెను. దానిని ఇప్పుడు మనము చూద్దాం.

**1. దేవుని ఆజ్ఞను అతిక్రమించుట పాపము.** "పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును; ఆజ్ఞాతిక్రమమే పాపము" అని 1 యోహాను 3:4లో పరిశుద్ధాత్ముడు ప్రకటించుచున్నాడు. పాపమనగా గురి తప్పిపోవుట యనుభావము దాని గ్రీకు పదములో యున్నది. పాపమనగా దేవుని ఆజ్ఞను నిర్లక్ష్యము చేయుట,

దాని నెదిరించుట యగును. అది నీతికి కేవలము వ్యతిరేకమైనది. అవును, అందుకే సకల దుర్నీతియు పాపము (1యోహాను 5:17).

2. అవిశ్వాసము పాపము. యేసు ఆదరణ కర్తయైన పరిశుద్ధాత్మని గూర్చి తన శిష్యులతో మాట్లాడుచు, "ఆయన వచ్చి పాపమును గూర్చియు, నీతిని గూర్చియు తీర్పును గూర్చియు లోకమును ఒప్పుకొన జేయును. లోకులు నా యందు విశ్వాసముంచ లేదు గనుక పాపమును గూర్చియు... నీతిని గూర్చియు ఈ లోకాధికారి తీర్పు పొంది యున్నాడు గనుక తీర్పును గూర్చియు ఒప్పుకొనజేయును" అని వారితో చెప్పెను (యోహాను 16:8-11). యేసుక్రీస్తు ఒక కన్యకు జన్మించ లేదనియు, ఆయన చేసిన అద్భుతములు, బోధించిన గొప్ప మాటలు నమ్మదగినవి కాదనియు కొందరు వాదింతురు. అయితే నమ్మనొల్లని వానికి శిక్ష విధింపబడు ననియు యేసుక్రీస్తే చెప్పెను (మార్కు 16:16).

3. సత్యమునకు చెవి ఇయ్య నొల్లకపోవుట పాపము. దేవుని మాటను విననొల్లని వానిమీదికి దేవుని ఉగ్రత వచ్చును. ప్రవక్తయైన యిర్మియా ద్వారా దేవుడు ఇశ్రాయేలీయుల నిట్లు హెచ్చరించెను: "నేను వారితో మాట లాడితిని గాని వారు మాట వినక పోయిరి; నేను వారిని పిలిచితిని గాని వారు ప్రత్యుత్తర మియ్యకపోయిరి గనుక యూదా వారి మీదికిని, యెరూషలేము నివాసులందరి మీదికిని రప్పించెదనని నేను చెప్పిన కీడంతయు వారిమీదికి రప్పించుచున్నాను" (యిర్మియా 35:17). నేటి ప్రజల స్థితి కూడ అట్లే యున్నది. నేటి జనుల ఆరోగ్యకరమైన బోధను సహింపక, దురద చెవులు గలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులకు తమ కొరకు పోగుచేసికొని సత్యమునకు చెవి ఇయ్యక కల్పనా కథలవైపునకు తిరిగిపోయిరి. క్రీస్తును గూర్చి, ఆయన స్థాపించిన సంఘమును గూర్చి, రక్షణ మార్గమును గూర్చి సత్యమును మేము బోధించు

చుండగా అనేకులు సత్యమునకు చెవి యియ్యక పోవుట విచారకరము. అయితే దేవుని మాటలకు లోబడని వారిని ఆయన ప్రతిదండన చేయును అని వాక్యము బోధించుచున్నది.

**4. దురభిమానము పాపము** అని దైవవేదము బోధించుచున్నది. అందుకే "దురభిమాన పాపములలో పడకుండ నీ సేవకుని ఆపుము, వాటిని నన్ను ఏలనియ్యకుము" అని దావీదు మహారాజు దేవుని ప్రార్థించెను (కీర్తన 19:13). దేవుని సత్య వాక్యమును బుద్ధిపూర్వకముగా చులకన చేయుట దురభిమానమని మనము చెప్పుకొనవచ్చును. సమూయేలు దగ్గర లేనప్పుడు సౌలురాజు దేవుని యాజకుడు కాకపోయినను తనకు తానే సాహసించి దేవునికి దహనబలి అర్పించెను. అతడు తన దేవుడైన యెహోవా యిచ్చిన ఆజ్ఞను గైకొనలేదని అందువలన అతనిని ఇశ్రాయేలీయుల రాజుగా నిర్మూలించెనని సమూయేలు అతనికి తెలియజెప్పెను (1 సమూ 13:12-14). అందువలననే క్రైస్తవులు తమంతట తామే దేవుని ఆరాధనలోనికి దైవానుమతి బడయని సంగతులను తీసుకొని రావలదని, లేఖనములను అతిక్రమింపకూడదని హెచ్చరించబడియున్నారు (1కొరింథి 4:6). "క్రీస్తు బోధయందు నిలిచి యుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపని వాడు; ఆ బోధయందు నిలిచి యుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు" (2 యోహాను : 9).

**5. నిర్లక్ష్యము చేయుట పాపము.** "కాబట్టి మేలైనది చేయ నెరిగియు ఆలాగు చేయనివానికి పాపము కలుగును" అని దేవుని వాక్యము చెప్పుచున్నది (యాకోబు 4:17). తలాంతును కలిగియు దానిని సద్వినియోగపరచని సేవకుడు సోమరియైన చెడ్డ దాసుడని పిలువబడెను (మత్తయి 25:26). మేలైనది చేయనెరిగియు దానిని చేయని వారు నిత్యాగ్నిలోనికి పోవుదురని మత్తయి 25:41-43లో

యేసు బోధించెను.

పాపము యొక్క ప్రత్యక్షతయే కాదు గాని దాని ప్రతిఫలము అంతయు మన చుట్టూయున్నది. బాధలు, వేదనలు, రోగము, మరణము కూడ మానవుడు దేవుని యెడల చేసిన తిరుగుబాటు యొక్క ప్రతిఫలమై యున్నది. అమాయకులైన పిల్లలు తమ తల్లిదండ్రుల పాపముయొక్క ప్రతి ఫలము ననుభవించ వలసి వచ్చు చున్నది. ఆదాము చేసిన పాపము వలన మరణము లోకమందు ప్రవేశించి, అది అందిరికని సంప్రాప్త మాయెను (రోమా 5:12). సృష్టి యావత్తు మానవుని పాపము వలన మూలుగుచున్నట్లుగుపడుచున్నది. అంతే కాదు, క్రీస్తునందుగాక తమ పాపములలోనే యుండి చనిపోయిన వారి స్థితి బహు ఘోరమైనది. అట్టివారు దేవుని సన్నిధినుండి తొలగించబడి నిత్యాగ్నిలో పడవేయ బడుదురు. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండును. ఆ వేదన అంతులేనిది. అది నిత్యనరకము.

అయితే దేవునికి స్తోత్రము కలుగును గాక, పాపమునకు విరుగుడు ఉన్నది. ఆ విరుగుడు యేసుక్రీస్తే. యేసు మనలను ప్రేమించి సిలువ పై తన పరిశుద్ధ రక్తమును చిందించి అనేకులకు ప్రతిగా విమోచన క్రయ ధనముగా తన ప్రాణమును నిచ్చెను. ఇప్పుడు ఆయన నామమందు విశ్వాస ముంచి ఆయన ఆజ్ఞలకు లోబడు వారిని ఆయన వారి పాపముల నుండి ఉచితముగా విడిపించుచున్నాడు. నీవు క్రీస్తునందు విశ్వసించి, మారు మనస్సు కలిగిన జీవితమును జీవించుటకు నిశ్చయించుకొని, క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినయెడల ఆయన ఈనాడే నిన్ను నీ పాపముల నుండి శుద్ధీకరించును. అటు తరువాత ఆయన వెలుగులో నీవు నడుచు కాలమంతయు దేవుని కుమారుడైన క్రీస్తు రక్తము ప్రతి పాపమునుండి నిన్ను పవిత్రునిగా చేయును (1 యోహాను 1:7).

పాపము నుండి నీవు విడుదల పొందగోరుచున్నావా?

# పాపము యొక్క మూడు వాస్తవములు

## ( The Three Facts of Sin )

సరిహద్దును దాటుట పాపము. అది తిన్నని మార్గములో గాక వంకర టింకరగా పయనించునది. దేవుడు నియమించిన ఉన్నత లక్ష్యమును సాధించకపోవుట పాపము. అది పతనమై పోవుట యగును. దిగువ సంగతులను గమనించుము :

**దాని యొక్క శక్తి :**

అది ఆశ చూపించును, ఉవ్విళ్ళూరించును, ఉద్రేకించును, శోధింపబడని మానవుడెవరు లేరు (మత్తయి 4:1-11; రోమా 7:21). దానికి ఎంత లోబడుదుమో దానిని నెదిరించుట అంత కష్టమగును. దాని నెంత ఎదురింతువో అంత దూరముగా అది పారిపోవును (యాకోబు 4:7,8).

అది మోసగించును (హెబ్రీ 3:13; 1 తిమో 2:14). అది విలాసాన్నే చూపించును గాని విషాదాన్ని దాచిపెట్టును. బాధను, అవమానమును కనబడనీయదు. అది గొప్ప వాగ్దానములు చేయును గాని మానవుడెరిగిన దాని కంటే ఎంతో తక్కువ యిచ్చును.

అది బానిసగా చేయును. ఉన్నత భావములను అణచి వేయును. మానవులను బందీలుగా నడిపించును (గలతీ 4:3; రోమా 6:16). అది చిత్తానికి పక్షవాతము కల్పించును, అనురాగాన్ని కల్మషము చేయును, విజ్ఞతను గ్రుడ్డిదిగా చేయును. మనుష్యులు దానికి లోబడే కొలదీ, వారిపై దాని పట్టు బిగించును.

**దాని యొక్క మరక :**

రాపిడి లేకుండా యేదీ పని చేయదు. ప్రతి గాయము దాని మరకను విడిచిపెట్టును. రోగము దాని చెరగని ముద్రను శరీరమందు విదుల్చును. అగ్ని, తుఫాను, వరద యివన్నీ భూమి

పై తమ గురుతులనుంచును. ఒకని జీవితంలో యున్న పాపము కూడ దాని మరకలను దానిపై మిగుల్చును.

**అతని పేరు ప్రఖ్యాతులు :** పాప జీవితము వలన ఒకని మంచి పేరు చెడును. దానిని తిరిగి సంపాదించుట కష్టమగును.

**అతని శరీరము :** కామాంధుడు విజ్ఞత లేని తన జీవితం యొక్క పర్యవసానమును తన శరీరమందు అనుభవించును. దుష్ప్రవర్తన వలన అనేక రోగములు సంభవించును.

**ఒకని ఆత్మ :** పాపము మనస్సాక్షిని ముతకచేయును. తదుపరి వాతవేయును (1 తిమో 4:2). దుష్క్రియను జరిగించి పవిత్ర తలంపులు కలిగి యుండుట అసాధ్యము.

**దాని అపరాధము :**

పాపము వలన అపరాధ భావము కలుగును. పరలోకంలో అది పాపియొక్క అకౌంటుగా రికార్డు చేయబడును. పాపము చేయునప్పుడు ప్రభువు దానిని మనకు విరుద్ధముగా రికార్డు చేయును. మానవులందరు దేవుని యెదుట అపరాధులని దిగువ సంగతులను బట్టి గమనించ గలరు.

1. పరలోక సాక్ష్యము : (రోమా 3:23; 1యోహాను 1:10).

2. మానవుని అంతరాత్మ : మానవులందరు తాము విలువ లేని వారమని తలంతురు. దు:ఖము నుండి పాపమును వేరుచేయుట అసాధ్యము.

3. మానవునికి పిరికితనము : పాపము మానవులందరినీ పిరికి పందలుగా చేయును (ఆది.కా. 3:8).

4. దేవుని కుమారుని మరణము : (1కొరింథీ 15:3,4).

పాపము యొక్క మూడు వాస్తవములు విషాద వాస్తవములను తెలియజేయుచున్నవి (రోమా 7:24). గాని దేవుడు తన మహోచితమైన కృప చొప్పున మనకు రక్షకుని అనుగ్రహించారు (మత్తయి 1:21).

పాపము యొక్క ముప్విధ వాస్తవముల నుండి ఆయన మనకు ముప్విధ రక్షణ ననుగ్రహించుచున్నారు. దాని యొక్క శక్తి నుండి ఆయన మన ప్రాణమును నాశనము నుండి విడిపించును, దాని మరక నుండి ఆయన తప్పించును. "ఆయన మన రోగములన్నిటిని కుదుర్చును" మనలను క్షమించిదాని అపరాధమునుండి కాపాడును.

విధేయత ఆయన యిచ్చు షరతు (రోమా 6:17,18). హృదయ పూర్వకముగా ఆయన యిచ్చిన ఉపదేశ క్రమమునకు లోబడుటవలన మనము పాపము యొక్క శక్తి నుండి, దాని డాగు నుండి మరియు దాని అపరాధము నుండి విడిపింపబడుదుము. యేసు ఒక గొప్ప వైద్యుడు. ఆయన యిచ్చు ఔషధమును సేవించకుండా ఏ రోగీ బాగుపడలేదు!!

- ఫ్రేంక్‌కాక్స్

## అమూల్యమైన స్వాధీనములు

## ( Precious Possessions)

బైబిలు గొప్ప పదముతో కూడిన గ్రంధము. వాటిలో "అమూల్యమైన" అనే పదము ఒకటి. పేతురు వ్రాసిన రెండు పత్రికలలోను ఈ పదమును పలుమార్లు వినియోగించాడు. దానికి గ్రీకులో "టిమియోస్" అను పదము వాడబడినది. గొప్ప విలువగలది, గొప్పదైన మూల్యము, మిక్కిలి ఘనతగలది, హెచ్చుగా ఎంచబడునది, ముఖ్యముగా ప్రియమైనది యనే భావము ఆ మాటలో యున్నది. క్రైస్తవునికున్న గొప్ప మూల్యము గలది, విలువైనది అని చెప్పుటకు పేతురు ఈ పదమును వినియోగించాడు. దిగువ సంగతులు ఆలోచించుము.

**అమూల్యమైన విశ్వాసము (1 పేతురు 1:7; 2పేతురు 1:1) :**

నశించిపోవు సువర్ణము అగ్ని పరీక్ష వలన శుద్ధపరచబడుచున్నది

గదా? దానికంటె అమూల్యమైన మీ విశ్వాసము ఈ శోధనల చేత పరీక్షకు నిలిచినదై యేసుక్రీస్తు ప్రత్యక్ష మైనప్పుడు మీకు మెప్పును మహిమయు ఘనతయు కలుగుటకు కారణమగును" (1 పేతురు1:7). మరల "యేసుక్రీస్తు దాసుడును, అపొస్తులుడునైన సీమోను పేతురు మన దేవుని యొక్కయు రక్షకుడైన యేసుక్రీస్తు యొక్కయు నీతిని బట్టియు మా వలెనే అమూల్యమైన విశ్వాసము పొందిన వారికి శుభమని చెప్పి వ్రాయునది" (2పేతురు 1:1).

ఈ విశ్వాసము సువర్ణము కంటె అమూల్యమైనది. ఆ విశ్వాసము ఎవరిపై కేంద్రీకృతమైనదో అందును బట్టి అమూల్యమైనది. దాని వలన మెప్పును ఘనతయు కలుగును. దేవుని యందు నీకిట్టి విశ్వాసమున్న యెడల, యేసునందును ఆయన వాక్యమందును నీకిట్టివిశ్వాసమున్న యెడల జాగ్రత్త కలిగియుండును. దానిని పోషించుము, దాని కొరకు పోరాడుము, దాని కొరకు ప్రాణమర్పించుము. ఇంత అమూల్యమైన విశ్వాసమును కొందరు పోగొట్టు కొనుట ఎంత విచారము!

**అమూల్యమైన రక్తము (1 పేతురు 18:19):**

"వెండి బంగారముల వంటి క్షయ వస్తువులచేత మీరు విమోచింపబడలేదు గాని అమూల్యమైన రక్తము చేత అనగా నిర్దోషమును, నిష్కళంక మునగు గొర్రెపిల్ల వంటి క్రీస్తు రక్తము చేత విమోచింపబడితిరి". యిది మన స్వాధీనములో యున్నది, అమూల్యమైనది. అదే రక్తము, భౌతికంగాను, ఆత్మీయము గాను ప్రాణము రక్తము లోనే యున్నది (లేవీ. కా. 17:11; హెబ్రీ 9:22). అది నిష్కళంకమైనది గనుక అమూల్యమైనది. అది అక్షయమైనది గనుక అమూల్యమైనది. ఆ రక్తము ఎవరిదో అందువలన అమూల్యమైనది. అది నిష్కళంకమును, నిర్దోషమునగు గొర్రె పిల్ల రక్తము, అనగా క్రీస్తురక్తము.

అమూల్యమైన వాగ్దానములు (2 పేతురు 1:4) :

"ఆ మహిమా గుణాతిశయములను బట్టి ఆయన మనకు అమూల్యములును, అత్యధికములైన వాగ్దానములను అనుగ్రహించి యున్నాడు. దురాశను అనుసరించుట వలన లోకమందున్న భ్రష్టత్వము ఈ వాగ్దానముల మూలముగా మీరు తప్పించుకొని దేవ స్వభావమునందు పాలి వారగునట్టు వాటిని అనుగ్రహించెను"

అమూల్యమైన విశ్వాసము - అమూల్యమైన రక్తము - అమూల్యమైన వాగ్దానములు ...

యివి నిజముగా మనకున్న అత్యంత అమూల్యములే. యివి ప్రశస్తమును అమూల్యములును గనుక వాటిని జాగ్రత్తగా కాపాడుకొందము!

- చార్ల్స్ పం

## మనం మరచిన బైబిలు వ్యక్తులు - యోసేపు

## ( Forgotten Men of the Bible - Joseph)

బైబిలులో కొంతమందిని గూర్చి మనం బాగా ఎరిగియున్నాము. అయితే బైబిలులో చెప్పబడిన మరి కొందరిని గూర్చి మనకు తెలిసినది చాలా తక్కువే. వీరిని గూర్చి బైబిలులో కూడ స్వల్పముగానే చెప్పబడినది. చాలాసార్లు వీరిని గూర్చి తెలిసి కొనుటకు మనం పెద్దగా ఆసక్తి కనుబరచము. ఏదోఒక కారణమును బట్టియే వారిని గూర్చి బైబిలులో చెప్పబడియుండును.

బైబిలులో యోసేపు అను వ్యక్తిని గూర్చి తలంచునప్పుడు మనం సాధారణంగా పాతనిబంధనలో కనబడు యోసేపునే తలస్తాము. అయితే అదే పేరుతో మరి యిద్దరు బైబిలులో మనకు కనబడుదురు. వారిలో మొదటి వాడు యేసు యొక్క పెంపుడు తండ్రియైన యోసేపు. రెండవ వాడు ప్రభువు యొక్క శరీరమును పాతిపెట్టుటకు తన సమాధిని అనుగ్రహించాడు.

**యేసును పెంచిన తండ్రియైన యోసేపు :** మొదటిగా యేసును పెంచిన తండ్రియైన యోసేపును గమనించుదాం. ఇతనిని గూర్చి బైబిలులో ఒకటి రెండు సార్లు మాత్రమే చెప్పబడినది. మత్తయి 1:16-21లో యేసు యొక్క జనన విధానమును గూర్చి మనం చదువగలము. అక్కడ మరియ యోసేపుకు ప్రధానము చేయ బడినట్లు చెప్పబడినది. యోసేపు మరియలకు వివాహము జరుగక ముందు ప్రధానము చేయబడిన తరువాత గడిచిన సమయమిది. ప్రధానము చేయబడిన తరువాత కాబోయే వధువు తన తల్లిదండ్రుల యింటిలోనే యుండును గాని సమాజపు దృష్టిలో (పురుషుడు, స్త్రీ) వివాహితులుగానే పరిగణింపబడేవారు (ద్వితీ 22:23,24). ఈ నిశ్చితార్థ క్రియను లయపరచవలెనన్న విడాకుల పత్రమును విధిగా తీసికొనవలెను.

ఇది ఇట్లున్న సమయములోనే పరిశుద్ధాత్మ వలన మరియ గర్భవతియాయెను. అయితే ఆమె ఎవరి వలన గర్భవతియాయెనో ఎరుగక యోసేపు ఆమెను విడనాడ నుద్దేశించెను. గాని అతడామెను అవమాన పరచ నొల్లకుండెను. ప్రధానము చేయబడిన స్త్రీ వేరొకనితో శయనించిన యెడల రాళ్ళతో ఆమె చావగొట్టబడ వలెను (ద్వితీ 22 : 23,24). గనుక ధర్మశాస్త్ర ప్రకారము యోసేపు ఆమెను విడనాడ నుద్దేశించెను (ద్వితీ 24:1). గాని ఒక స్వప్నము ద్వారా దేవుడు మరియను విడనాడరాదని యోసేపుకు తెలియ జేయుగా అతడామెను భార్యగా స్వీకరించెను.

మత్తయి 2:13-15; 2:19-23 యోసేపును గూర్చి రెండవ మారు, మూడవ మారు ప్రస్తావించుట జరిగినది. ఈ రెండు సందర్భము లలోను దేవుడు యోసేపుతో స్వప్న మందు మాటాలాడెను. మొదటి సందర్భములో తన కుటుంబముతో యోసేపు ఐగుప్తుకు తరలి పోవలెనని చెప్పబడెను. రెండవ సందర్భములో అతడు స్వదేశమునకు తిరిగి వెళ్లుట

క్షేమమేయని చెప్పబడెను.

మరియొక ప్రాముఖ్య సందర్భము లూకా 2 : 4-7లో మనకు కనబడును. ఇక్కడ యోసేపు మరియలు ప్రజాసంఖ్యలో వ్రాయబడు నిమిత్తము బేత్లెహేముకు పయనించుట చూడగలము. వారు బెత్లేహేములో యుండగా యేసు జన్మించెను. బాలుడైన రక్షకుని గొల్లలు దర్శించుటకు వచ్చినప్పుడు 10వ వచనములో యోసేపు అక్కడ వున్నట్లు చూడగలము. లూకా 2:22-39లో శిశువుగా యున్న యేసును దేవాలయమునకు తీసికొని వెళ్లుటకు వారు పడిన సిద్ధపాటును గూర్చి చూడగలము (లేవీ 12:1-8). మరల యేసు 12వ సంవత్సరమునకు వచ్చి నప్పుడు యోసేపు మరియలు పస్కాలో పాల్గొనుటకు యేసును వెంటబెట్టుకొని యెరూషలేమునకు వెళ్ళుట గమనించ గలము. అటు తరువాత యోసేపు యొక్క పేరు మూడు మారులు మాత్రమే బైబిలులో చెప్పబడెను (లూకా 3:23; యోహాను 1:45; 6:42). ఈ మూడుచోట్ల యోసేపు కుమారుడైన యేసు అని చెప్పబడెను.

పాపులను రక్షించుటకు దేవుడు తన కుమారుని ద్వారా చేసిన సంకల్ప ములో అంతప్రాముఖ్య పాత్ర వహించిన యోసేపును గూర్చి బైబిలులో పెద్దగా చెప్పబడలేదు. నేడు యేసు తల్లియైన మరియను అనేకులు జ్ఞాపకముంచుకొందురు. దేవునిచే ఎంపిక చేయబడినది గనుక ఆమె ఎంత నీతిమంతురాలో యనే దానికి ప్రాధాన్యత ఇయ్యబడుచున్నది. అయితే యోసేపును గూర్చి మాత్రం బహు అరుదుగా చెప్పబడియున్నది. యేసుకు తల్లిగా యుండుట మరియకు ఎంత ఘనతో ఆయనకు తండ్రిగా యుండుట యోసేపుకు కూడా అంతే ఘనత.

యేసు యొక్క భూ సంబంధ తండ్రిగా పిలువబడుటకు ఈ మనుష్యుడు ఎంచుకొనబడెను. మంచి మాదిరి ద్వారా యోసేపు తన పిల్లలకు నేర్పించినట్లు బైబిలును బట్టి తెలిసి కొనగలము. యేసుకు ఎనిమిదవ దినమున సున్నతి జరుగు నట్లు

యోసేపు జాగ్రత్తలు తీసికొన్నాడు. ధర్మ శాస్త్ర నియములన్నియు పాటించుటలో అతడు తన భార్యను కూడ ప్రోత్సహించాడు. అట్లు చేయుట వలన అతడు తన గృహమునకు ఆత్మీయ నాయకుడయ్యాడు. మరల ఏటేటా పస్కాపండుగ నాచరించుటకు యెరూషలేముకు వెళ్లుటలో అతడు వెనుకాడలేదు. యోసేపు వలె మనము దేవుని ఆజ్ఞలను పాటించుటకు శ్రద్ధ కలిగి యుండాలి. యోసేపు వలె ప్రతి భర్త కూడా తన గృహానికి ఆత్మీయ నాయకునిగా యుండాలి.

మరల యోసేపు వలె మనము ఆజ్ఞలకు విధేయత చూపించుటకాసక్తి కలిగి యుండాలి. దేవుడు యోసేపుకు ముమ్మారు స్వప్నము ద్వారా దర్శన మిచ్చెను. ప్రతిసారి యోసేపు దేవుని ఆజ్ఞకు వెంటనే లోబడెను. యోసేపు నీతిమంతుడని కూడ చెప్పబడెను (మత్తయి 1:19). అతడు నీతిమంతుడై యుండి అందరితో న్యాయముగా ప్రవర్తించేవాడు. అందువలననే మరియు విషయములో కూడ న్యాయముగా ప్రవర్తించాడు. ఆమెను అవమానమునకప్పగించలేదు. క్రైస్తవుల వలె మనము నీతి యధార్ధతలు గలవారముగా పేరొందాలి. యోసేపు వలె యితరులను క్షమించుటకు వారి యెడల దయ చూపించుటను నేర్చు కోవాలి.

### అరిమతయి యోసేపు

యేసును పెంచిన తండ్రియైన యోసేపును గూర్చి దేవుని గ్రంధములో పెక్కుగా ఎట్లు వ్రాయబడలేదో అరిమతయి యోసేపును గూర్చి కూడ అంతే. అతని గూర్చి మనం ఎరిగినది బహు స్వల్పమే. యేసు సిలువ మీద మరణించిన తరువాత ఆయన శరీరమును పాతిపెట్టుటకు ఒకడు ముందుకు వచ్చెను. అరిమతయి అనే ఊరివాడైన యోసేపు అను ఈ మనుష్యుని గూర్చి బైబిలులో నాలుగు చోట్ల మాత్రమే కనబడును (మత్తయి 27:57-60; మార్కు 15:43-46; లూకా 23:50-53; యోహాను 19:28-42). ఈ ప్రతి ఒక్క లేఖనము

మన ప్రభువు యొక్క సమాధిని గూర్చి చెప్పబడినది. అరిమతయి వాడైన యోసేపు ధనవంతుడు. మన ప్రభువు పాతిపెట్టబడిన సమాధి అతనిదే. అది క్రొత్తది (యోహాను 19:41; మత్తయి 27:60). అతడు క్రొత్త నారబట్టను కొని ప్రభువు శరీరమును దానితో చుట్టి బండలో తొలిపించిన సమాధిలో ఆయనను పాతిపెట్టెను (మార్కు 15:41). యోసేపు తన ధనమును, ఆస్థిని సమయాన్ని కూడ క్రీస్తు కొరకు త్యాగము చేసాడు. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఆ సమాధి నుండి తిరిగి లేచునని ఎరుగక ముందే యోసేపు ఈ క్రియలను చేసాడు. క్రీస్తే మన రక్షకుడని ఎరిగిన తరువాత యోసేపు వలె మనము కూడ క్రీస్తు కొరకు త్యాగం చేయాలి.

అరిమతయి యోసేపు సమాజ మందిరపు సభ్యుడై యుండెను. అది యూదుల పాలనావ్యవస్థ. ఈ సమాజ మందిరమే యేసును చంపగోరెను. ఆయనే క్రీస్తని చెప్పుకొనుచున్నందున ఆయనను తీర్పు తీర్చిన వారు కూడ ఈ సమాజమందిరపు వారే. యోసేపు వారిలో ఒక సభ్యుడే అయినను క్రీస్తును చంపుటకు వారు చేసిన నిర్ణయమునకు అతడు వ్యతిరేకించాడని లూకా 23:51 వలన మనకు తెలియును. "అతడు సజ్జనుడును, నీతిమంతుడు నని" చెప్పబడియున్నది.

రాబోవు మెస్సీయను గూర్చిన పాతనిబంధన ప్రవచనములను యోసేపు విశ్వసించాడు. సమాజ మందిరమువారు యేసును గూర్చి తీసికొన్న నిర్ణయముతో తాను ఏకీభవించుట లేదని వారికతడు తెలియజేసాడు. యూదుల భయము వలన అతడు రహస్యముగా యున్న యేసు శిష్యుడని యోహాను 19:38లో చెప్పబడినను, యేసును పాతిపెట్టుటకు అతడు ముందుకు వచ్చి పిలాతు వద్ద సెలవడిగెను. దాని పర్యవసానమును అతడు లెక్క చేయలేదు. సత్క్రియను చేయుటకు మనం ఎన్నడు వెనుకాడరాదు.

ఈ యిద్దరు యోసేపులు మనకు క్రీస్తునందలి జీవితమును

గూర్చి ఎంతో బోధించుచున్నారు. మరియ భర్తయైన యోసేపును, అరిమతయి వాడైన యోసేపును కూడ నీతిమంతులని చెప్పబడినది (మత్తయి 1:19; లూకా 23:50). వారు తమ్మును తాము త్యాగము చేసికొనిరి. యేసును పెంచిన తండ్రియైన యోసేపు వివాహమునకు ముందే గర్భవతి యైన స్త్రీని పెండ్లాడి గొప్ప అవమానమును సహించెను. తనది కాని బిడ్డ కొరకు అతడు సమయాన్ని, ధనాన్ని, గౌరవమును వెచ్చించాడు.

అరిమతయి యోసేపు కూడ తన ధనాన్ని, ఆస్థిని, సమాజములో తన స్థానమును క్రీస్తు శరీరమును పాతి పెట్టుటలో త్యాగం చేసాడు. క్రైస్తవులుగా ఈ యిద్దరిని అనుకరించుట మనకెంతో శ్రేష్ఠము!

-రెబెక్కా రష్మోం

## మహిమ గల సంఘము

## ( The Glorious Church)

సంఘము అంతప్రాముఖ్యము కాదను రోజులలో దేవుని దృష్టిలో దాని విలువను గమనించినప్పుడు మనం సంతోషిస్తాము. సంఘము యొక్క స్థానము, దాని ప్రయోజనమును ఎఫెసీ పత్రిక మనకు వివరించు చున్నది. దానిలో ఆరు ప్రాముఖ్య వాస్తవములను గమనించుము :

**క్రీస్తు దాని శిరస్సై యున్నారు : (ఎఫెసీ 1 : 22 - 23).**

అధికారము విషయమై యున్న గందరగోళమును యిది శాశ్వతముగా పరిష్కరించును. సంఘమునకు ప్రాణము ఆయనే. యేమిచేసినా సంఘము ఆయన మహిమ కొరకే చేయాలి (ఎఫెసీ 2: 13-16). సంఘానికి రక్షణకు యేమి సంబంధము లేదని కొందరు వాదింతురు. గాని ఆయనే మనలను సంఘముతో చేర్చునని బైబిలు బోధించు చున్నది (అపో.కా. 2:4). అది దేవుని నిత్య సంకల్పము ప్రకార

మున్నది : (ఎఫెసీ 3:9-12).

దేవుని సంకల్పములో అది అకస్మాత్తుగా తగిలింపబడలేదు. అది ఆయన నిత్యసంకల్పమును నెరవేర్చి నది. పాతనిబంధనలో చేయబడిన వాగ్దానములు, దృశ్యములు, ప్రవచనములన్నియు దానిని గూర్చి చెప్పబడినవి.

**అది ముఖ్యాతిముఖ్యముగా ఒక్కటే యున్నది :**

సంఘము చీలికలై డినామినేషన్లుగా యుండాలనేది ఆయన సంకల్పము ఎన్నడు కాదు. 'ఒకే ఒక్క శరీరమున్నది' యని పౌలు వక్కాణించాడు (ఎఫెసీ 4:4). గుంపు తత్వము పాపము. విభజనలు లేక చీలికలు తప్పు. తన శిష్యులందరు ఏకమై యుండాలని యేసు చేసిన ప్రార్ధనకు అతి వ్యతిరేకము (యోహాను 17: 21-22).

**అది పవిత్రమైన క్రీస్తు వధువు వలె పరిశుద్ధమైనది :**

ప్రేమతో నడుచుకొనవలెను, వెలుగులో నడుచు కొనవలెనని దానికి చెప్పబడినది (ఎఫెసీ 5:2,8). నిష్ఫలమైన అంధకార క్రియలతో మనకు సహవాసము యేమీలేదు (ఎఫెసీ 5:11). సంఘము ప్రత్యేకముగా యుండుటకు "పిలువ బడిన వారు".

**దేవుని సైన్యము వలె అది పోరాట పటిమ కలిగి యుండును :**

(ఎఫెసీ 6:10-18) మనమొక పోరాటములో యున్నాము. గనుక సంఘము నిర్లిప్తముగా యుండరాదు. దేవుడు మనకు ఎదుర్కొనుటకు, ఎదిరించుటకు అవసరమైన ఆయుధములననుగ్రహించి యున్నారు (ఎఫెసీ 6:11). మన శత్రువును మనం తెలిసికొనాలి. గనుక ఎల్లప్పుడు సిద్ధముగా యుండుడి, ఆయుధధారులై యుద్ధ సన్నద్ధులై ఎల్లవేళలా యుండుడి.

ఎఫెసీ పత్రిక ఎంత గొప్పదో! దేవుని చిత్తములో సంఘము యొక్క స్థానమునది హెచ్చించును. ఈ ప్రాముఖ్య సూత్రములను మనందరము ఎరిగినవారమై యుండాలి!

– క్లేరెన్స్‌డిలోచ్

# నీవేమి ధరించుకొన్నావు ?

## ( What Have You Put on ?)

ప్రజలు తమ అంతస్థుకు తగినట్లుగా దుస్తులు ధరిస్తారు. మన వస్త్రధారణను బట్టి మన అంతస్థు తెలియనగును. కొన్ని సందర్భాల్లో ఆయా వ్యక్తులు ధరించే దుస్తులు వారు చేసే పనిని తెలియజేస్తాయి. ఉదా: పోలీసులు, నర్సులు, స్కూలు పిల్లలు. మరికొందరు ధరించే దుస్తులు వారి జాతిని తెలియజేస్తాయి. సంపన్నులు ఉదారంగు వస్త్రములను ధరించుట కద్దు (లూకా 16:19).

దేవుడు మొదట స్త్రీ పురుషులను చేసినప్పుడు వారు దిగంబరులు. దేవుడు నిషేధించిన ఫలాన్ని తిని నప్పుడు "వారిద్దరి కన్నులు తెరవబడెను; వారు తాము దిగంబరుల మని తెలిసి కొని అంజూరపు ఆకులు కుట్టి తమకు కచ్చడములు చేసికొనిరి" (ఆది.కా.3: 7). దేవుడు స్త్రీ పురుషు లను సర్పమును శపించెను. మరియు "దేవుడైన యెహోవా ఆదామునకును అతని భార్యకును చర్మము చొక్కాలను చేయించి వారికి తొడిగెను" (ఆది.కా. 3:21).

మన మొదటి తల్లిదండ్రులకు దేవుడే వస్త్రములను చేయించెను. యాకోబు తన భార్య యగు రాహేలు యెడల ప్రత్యేక ప్రేమను కనబరుస్తు యోసేపుకు రంగురంగుల అంగీని చేయించి యిచ్చెను. దేవుడు అహరోనును ప్రధాన యాజకునిగా నియమించినప్పుడు అతడు ధరించ వలసిన ప్రత్యేక దుస్తులను గూర్చిన హెచ్చరికలను నిర్గమ 28:2-14లో యిచ్చెను. సహోదరులు ఐక్యత కలిగి నివసించినప్పుడు అది తలమీదపోయ బడి అహరోను గడ్డము మీదుగా కారి అతని అంగీల అంచు వరకు దిగజారిన పరిమళతైలము వలె యుండునని దావీదు చెప్పెను (దా.కీర్తన 133:2). "బాలుడైన సమూయేలు నారతో నేయబడిన ఏఫోదు ధరించుకొని యెహోవాకు పరిచర్య చేయుచుండెను". వాని తల్లి వానికి చిన్న అంగీ ఒకటి కుట్టి యేటేట బలి అర్పించుటకు తన పెనిమిటితో కూడ వచ్చినప్పుడు దాని తెచ్చి వాని కిచ్చుచువచ్చెను" (1 సమూ 2:18, 19). ఏలియా తన దుప్పటిని ఎలీషా

మీద వేసి అతని ప్రవక్తగా నియమించెను. ఏలియా ఆకాశమున కారోహణమయి నప్పుడు అతని దుప్పటి క్రింద పడగా ఎలీషా దానిని తీసికొనగా అతడు ప్రవక్తగా ఏలియా కంటే రెట్టింపు శక్తిని బొందెను (2 రాజులు 2:8-13). రాజులు, రాజవస్త్రములు ధరించేవారు. దు:ఖసమయాల్లో పూర్వము ప్రజలు తమ వస్త్రములను చింపుకొనేవారు.

ఆకాను శపితమైన హాయి వారి సొమ్ములో ఒక మంచి షీనారు వస్త్రమును రెండు వందల తులముల వెండిన, ఏబది తులముల బంగారు కడ్డీని ఆశించి దొంగిలించెను. దురాశ వలన అతడు, అతని కుటుంబీకులు చంపబడిరి (యెహోషువా 7:1-26). ఎలీషా యొక్క సేవకుడగు గెహజీ నయమాను దగ్గర రెండు జతల బట్టలను వెండిని ఆశించినందున కుష్టురోగముతో శపించబడెను (2 రాజులు 5:22-27).

క్రొత్త నిబంధనలో యేసు ప్రభువు జన్మించగానే ఆయన పొత్తి గుడ్డలతో చుట్టబడి పశువుల తొట్టిలో పరుండబెట్టబడెను (లూకా 2:7). బాప్తిస్మమిచ్చు యెహాను ఒంటె రోమముల వస్త్రమును మొల చుట్టు తోలు దట్టియు ధరించుకొనేవాడు (మత్తయి 3:4). గుడ్డివాడైన బర్తిమయిని యేసు పిలిచినప్పుడు వాడు బట్టను పారవేసి దిగ్గన లేచి యేసు నొద్దకు వచ్చెను (మార్కు 16:5; లూకా 24:4; యెహాను 20:12). యేసు సిలువ వేయబడగా సైనికులు ఆయన వస్త్రము కొరకు చీటి వేసుకొనిరి. యేసు పరమున కారోహణడవుచుండగా తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు, ఆయన ఏ రీతిగా వెళ్ళెనో అదే రీతిగా తిరిగి వచ్చునని చెప్పిరి (అపో.కా. 1:10,11). ప్రకటన 1: 13లో పాదముల మట్టునకు దిగుచున్న వస్త్రము ధరించుకొనిన యేసు యోహానుకు దర్శనమిచ్చెను.

ఈ సందర్భములన్నిటిలోను ఆయా ప్రజలు ధరించుకొనిన వస్త్రములను ప్రాముఖ్యంగా మనం గమనించగలము. "యేమితిందుమో యేమి త్రాగుదుమో, యేమి ధరించు కొందుమో అని మీ దేహమును గూర్చి యైనను చింతింపకుడి; ఆహారము కంటే ప్రాణమును వస్త్రము కంటే దేహమును గొప్పవి కావా?" యని యేసు చెప్పెను (మత్తయి 6:25). లూకా 16లో యున్న ధనవంతుడు

ఊదారంగు వస్త్రముల కొరకు చింతించాడు గాని ఆత్మీయ వస్త్రము లను గూర్చి ఎన్నడు ఆలోచించ లేదు.

క్రీస్తును ధరించు కొన్న వారు క్రైస్తవులు. "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించు కొని యున్నారు" (గలతీ 3:27). పౌలు ఇంకా ఇట్లు చెప్పాడు : "నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడి యున్నాను; ఇకను జీవించు వాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి నాకొరకు తన్నుతాను అప్పగించుకొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసము వలన జీవించుచున్నాను" (గలతీ 2:20).

యెరూషలేము దేవాలయము దగ్గర పేతురు యోహానులు ఒక కుంటి వానిని స్వస్థపరచినప్పుడు గొప్ప గందరగోళము జరిగెను. పేతురు యోహానులు అక్కడ గుమి గూడిన జన సమూహామునకు బహు ధైర్యముగా వాక్యము బోధించిరి. "వారు పేతురు యోహానుల ధైర్యమును చూచినప్పుడు వారు విద్యలేని పామరులని గ్రహించి ఆశ్చర్యపడి వారు యేసుతో కూడ ఉండిన వారని గుర్తెరిగిరి" (అపొ. కా. 4:13). పేతురు యోహానులు తమ జీవితము ద్వారా నిజంగా దేవుని మహిమ పరచిరి. "మనము అంధకార క్రియలను విసర్జించి తేజస్సంబంధమైన యుద్ధోపకరణము లను ధరించు కొందుము. పగటియందు నడుచు కొన్నట్టు మర్యాదగా నడుచుకొందము. మెట్టుకు ప్రభువైన యేసుక్రీస్తును ధరించుకొనిన వారై, శరీరేచ్ఛలను నెరవేర్చుకొనుటకు శరీర విషయమై ఆలోచన చేసికొనుడి" (రోమా 12:12 -14) యని పౌలు హెచ్చరించాడు.

క్రీస్తును ధరించుకొన్నపుడు నూతన సృష్టి అగుదుము. "మీ చిత్త వృత్తి యందు నూతన పరచబడిన వారై నీతియు యదార్థమైన భక్తియు గలవారై దేవుని పోలికెగా సృష్టింపబడిన నవీన స్వభావమును ధరించుకొనవలెను" (ఎఫెసీ 4:23,24). మనము దేవుని సర్వాంగ కవచమును ధరించుకొను నపుడు అపవాది యొక్క తంత్రములను ఎదిరించుటకు శక్తి గలవారమగుదుము (ఎఫెసీ 6:11-17). ఏలయనగా మన ప్రాచీన స్వభావము దాని క్రియలతో కూడ విసర్జింపబడగా జ్ఞానము కలుగు నిమిత్తము మనలను సృష్టించిన వాని పోలిక చొప్పున నూతన పరచ

బడుచున్న నవీన స్వభావమును ధరించుకొందుము (కొలస్స 3:10). క్రీస్తును ధరించుకొన్న వారు "జాలిగల మనస్సును, దయాళుత్వమును వినయమును సాత్వికమును దీర్ఘశాంతమును ధరించుకొందురు" (కొలస్స 3:12). వీటన్నిటికి పైన పరిపూర్ణతకు అనుబంధమైన ప్రేమను ధరించుకొందురు (కొలస్స 3:14).

క్రైస్తవ స్త్రీలు అణుకవయు స్వస్థ బుద్ధియు గలవారై యుండి సత్క్రియల చేత తమ్మును తాము అలంకరించు కొనవలెనని పౌలు ఉపదేశించెను (1తిమో 3:9,10; 1పేతురు 4:8). క్రైస్తవులు దీనమనస్సు అను వస్త్రము ధరించుకొని తమ్మును తాము అలంకరించు కొనవలెనని పేతురు హెచ్చరించాడు (1పేతురు 5:5). క్రీస్తును ధరించుకొన్నవారు వినయము, విధేయత, దీనమనస్సు లను ధరించు కొంటారు. ఈ లక్షణాల ద్వారా వారు దేవుని మహిమపరుస్తారు.

పెండ్లి విందునకు పిలువబడిన వాడు తగిన వస్త్రము ధరించుకొని యుండనందున యజమానుడు వానిని బయట చీకటిలోనికి పడవేయించిన ఉపమానమును యేసు బోధించారు. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండును (మత్తయి 22:11-14). లవొదికయలో యున్న సంఘమునకు ప్రభువు ఇట్లు చెప్పారు. "నీ దిసమొల సిగ్గుకనబడకుండునట్లు ధరించు కొనుటకు తెల్లని వస్త్రములను నీకు దృష్టి కలుగునట్లు నీ కన్నులకు కాటు కను నా యొద్దకొనుమని నీకు బుద్ధి చెప్పుచున్నాను" (ప్రక 3:18).

"జయించువాడు ఆలాగున తెల్లని వస్త్రములు ధరించుకొనును; జీవ గ్రంథములో నుండి అతని పేరెంత మాత్రము తుడుపు పెట్టక, నా తండ్రి యెదుటను ఆయన దూతల యెదుటను అతని పేరు ఒప్పు కొందునని" ప్రభువు చెప్పెను (ప్రక 3:5,6). ఈ పుడమి పై ఆయన నామమును ధరించిన వానికి ప్రభువు యిచ్చిన వాగ్దానమిది. క్షయమైన ఈ శరీరము అక్షయతను ధరించుకొను దినము కొరకు మనము ఆశతో ఎదురు చూచుచుందుము గాక! (కొరింథీ 15:53).

- కబిత గూటం

# సంక్షిప్త వార్తలు

క్రీస్తు సంఘములు నిర్వహించిన యేసుక్రీస్తు రక్షణ సువార్తసభలు 2018 మే నెల 9,10,11 తేదీలలో కాకినాడలోని ప్రసిద్ధ మెక్లారిన్ హై స్కూల్‌లో విశాల ఆవరణలో ప్రతి రోజు రాత్రి ఘనము నిర్వహించబడెను. గత మూడు సంవత్సరములలో వలెనే ఈ నాల్గవ సంవత్సరము కూడ సహో.కె. మోజెస్ కుమార్, యస్. ప్రభాకర్, ఈ. అబ్రాహామ్ లింకన్ మరియు పి. బలరాం గార్లు బాధ్యత వహించి, అనేక శ్రమలనోర్చి సభలను నిరాటంకముగా, చక్కటి క్రమశిక్షణతో నిర్వహించిరి.

ఆ సభలలో సోదరులు జి. వంశీ భూషణం (చీరాల) బి.జాన్‌రత్నం (రంపచోడవరం), వి. సహదేవ్ (తాడేపల్లి గూడెం), ఎ. విశ్వేశ్వరరావు (కొవ్వూరు), పి. వెంకటరావు (రాయుడుపాలెం, కాకినాడ), వి. రాజా విజయకుమార్ (రాజమండ్రి) గార్లు ముఖ్య ప్రసంగీకులుగా వ్యవహరించిరి. సంఘమును గూర్చిన సంపూర్ణ సత్యమను అంశము పై ఆధారపడి పైనుదహరించిన సహోదరులు యుగములలో, తరములలో దాగియున్న దేవుని రాజ్యము, క్రీస్తుసంఘమే దేవుని రాజ్యము, నేటి క్రైస్తవుని చట్టం పాత నిబంధనా లేక క్రొత్త నిబంధనా? సంఘములో, కుటుంబములో పరిశుద్ధత, సంఘ పరిచర్యలో నేటి యువత అను ప్రాముఖ్యాంశములను నిశితముగా వివరించిరి. మరియు సోదరులు మడికి స్టేన్లీ, కె.వి.ప్రసాద్, సి.హెచ్. కోటేశ్వరరావు గార్లు క్లుప్త ప్రసంగములనందించిరి. సోదరులు జి.బి.సింగ్, ఎమ్. సూర్యారావ్, మరియు కిరణ్‌కుమార్ గార్లు అధ్యక్షత వహించి సభలను సమర్ధవంతముగా ఆయాదినాలలో నిర్వహించిరి.

కూటములు అంతమయ్యేసరికి రాత్రి 10.30 గంటలు అగుచున్నందున వచ్చిన వారందరికి బి.జాన్‌రత్నం గారు, యమ్. సామ్యేలు రాజు గారు మరియు పెదపూడి క్రీస్తుసంఘము భోజన ప్యాకెట్లను, మంచినీటిని సరఫరా చేసిరి. జగన్నాథపురంలోని బాలాజీ నగర్ క్రీస్తు సంఘము కూడ భోజనమును సరఫరా

చేసిరి. వేలకొలదీ ప్రజలు సకాలమునకు హాజరై గొప్ప ఆత్మీయానుభూతిని పొందిరి. ఇట్టి సభలను ప్రతిజిల్లాలో జరిగించగల సామర్థ్యము గల సహోదరులను దేవుడు ప్రేరేపించునట్లు ప్రార్థించ మనవి

2018 మే నెల 31వ తారీకున అమెరికాలో సోదరి కవితా గూటం గారికి స్పాండిలైటీస్ (మెడనొప్పి) సంబంధమైన బాధనుండి స్వస్థత పొందునట్లు ఆపరేషన్ చేయబోవుచున్నారు. ఆ సందర్భముగా జాషువా గారు మే నెల 24వ తేదీ సాయంత్రం బయలుదేరి అమెరికా 25వ తేదీ సాయంకాలమునకు చేరుకొందురు. జూన్ మొదటి వారమునకు రిక్కీ గారు, ఆయన కుటుంబము అమెరికా నుండి కాకినాడ చేరుకొందురు. జూలై రెండవ వారమునకు జాషువా గారు కవితా గూటం గారు కాకినాడ చేరుకొనునట్లు ఏర్పాట్లు జరుగు చున్నవి. వీటన్నిటిని గూర్చి సహోదర సహోదరీలు సంఘములు ప్రార్థించ మనవి.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2018-20

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004